నమస్తే తెలంగాణ
యాదాద్రి భువనగిరి
I | హైదరాబాద్, శుక్రవారం 24 జనవరి 2025 | YADADRI BHUVANAGIRI


ఆత్మకూరు(ఎం) : కొరటికల్ గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న గ్రామస్తులు

## గ్రామసభల్లో ఎక్కడికక్కడ నిలదీతలు

# పల్లెలన్నీ మర్లపడుతున్నయ్

- అధికారుల అడ్డగింతలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మూడో రోజూ జనాగ్రహం
- జాబితాల్లో తమ పేర్లు లేవంటూ ఆక్రోశం

- బీబీనగర్‌లో కాంగ్రెస్ కార్యకర్తలే లొల్లిలొల్లి
- అడ్డగూడూరులో మహిళల నిరసన
- మోటకొండూరులో గందరగోళం
- అంతటా ముందస్తుగా పోలీస్ బందోబస్త్

యాదాద్రి భువనగిరి, జనవరి 23 (నమస్తే తెలంగాణ): ప్రజాపాలన గ్రామ సభల్లో మూడు రోజూ జనాగ్రహం పెల్లుబికింది. మొదటి రెండు రోజుల మాదిరిగానే పల్లెపల్లెనా గ్రామస్తులు మర్లపడుతున్నారు. ఎక్కడికక్కడ సభలను అడ్డగిస్తూ అధికారులపై తిరుగబడుతున్నారు. అర్హుల జాబితాను చదవకుండా నిరసనలు హోరెత్తాయి. జాబితాలో పేర్లు లేకపోవడంపై పలు చోట్ల ఏకంగా కాంగ్రెస్ శ్రేణులే నిలదీతకు దిగాయి. వరుస నిరసనలతో పోలీస్ బందోబస్తు గ్రామ సభలు నిర్వహిస్తున్నారు.

### మూడో రోజూ రభస..

ప్రజాపాలన గ్రామ సభల్లో భాగంగా నాలుగు పథకాల అమలుపై బుధవారం జిల్లావ్యాప్తంగా సమావేశాలు నిర్వహించారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా పథకాలకు సంబంధించి అధికారులు జాబితాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా అర్హుల జాబితాను చదువుతుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. తమ


యాదగిరిగుట్ట : మల్లాపురం గ్రామంలో రసాభాసగా గ్రామసభ

పేర్లు లేవంటూ, అర్హుల ఎంపిక సరిగా లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనల ప్రకారం జాబితాను తయారు చేయలేదని విరుచుకుపడ్డారు. ఎకరాల్లో భూములు, ధనవంతులు, ఇండ్లు ఉన్నోళ్లు, ఇప్పటికే లబ్ధి పొందినోళ్లను ఎలా ఎంపిక చేస్తారని నిలదీశారు. కొన్ని చోట్ల మహిళలు కన్నీరు పెట్టుకోగా, ఇంకొన్ని చోట్ల అధికారులతో గొడవకు దిగారు. దీంతో అధికారులు సమాధానం చెప్పలేక నానాతంటాలు పడ్డారు. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో జనం మరింత ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ మండిపడ్డారు.

బీబీనగర్ పట్టణ కేంద్రంలో గ్రామ సభ రసాభాసగా జరిగింది. ఇక్కడ కాంగ్రెస్ కార్యకర్తలే సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అధికారులు ముసాయిదా జాబితాను చదవకుండా అడ్డం తగిలారు. సుమారు వెయ్యి మంది అర్హులు ఉంటే కేవలం 300 మందితో రేషన్ కార్డు జాబితా ఎలా ఇస్తారని నిలదీశారు. పోలీసులు జోక్యం చేసుకుని సమాధానం చెప్పే ప్రయత్నం చేసినా కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. ఇదే మండలంలోని కొండమడుగు గ్రామంలో అధికారులపై గ్రామస్తులు తిరగబడ్డారు. మోటకొండూరు మండల కేంద్రంలో జరిగిన గ్రామ సభలో గ్రామస్తులు అధికారులను నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీ నాయకులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అడ్డగూడూరులో గ్రామసభకు మహిళలు పెద్దఎత్తున వచ్చి అధికారులను నిలదీశారు. వలిగొండ మండలంతోపాటు వర్కట్‌పల్లిలో అర్హులను కాదని, అనర్హులకు జాబితాలో చోటు కల్పించారంటూ అధికారులు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆత్మకూరు (ఎం) మండలంలోని కొరటికల్‌లో గ్రామసభను జనం అడ్డుకున్నారు. నారాయణపురం మండలం కేంద్రంలో అర్హులకు పథకాలు కేటాయించాలని ఓ వ్యక్తి అధికారి కాళ్లు పట్టుకుని బతిలాడాడు.


మోటకొండూర్ మండల కేంద్రంలో జాబితాలో తన పేరు లేదని అధికారులను ప్రశ్నిస్తున్న మహిళను వారిస్తున్న పోలీస్

### సూర్యాపేట జిల్లాలో పెల్లుబికిన ప్రజాగ్రహం

సూర్యాపేట జిల్లాలోని మఠంపల్లి మండలంలో సంక్షేమ పథకాలకు ఎంపిక కాని అర్హులు అధికారులను నిలదీశారు. గరిడేపల్లి మండలం గారకుంటతండాలో రేషన్ కార్డులు ఇండ్ల జాబితాపై తండావాసులు మండిపడ్డారు. జాబితాలో అర్హుల పేర్లు అధికారులతో వాగ్వాదానికి దిగారు. కోదాడ మండలం కూచిపూడిలో దివ్యాంగురాలు శంకర్‌శెట్టి నాగలక్ష్మి ఇందిరమ్మ ఇంటికి దరఖాస్తు చేసుకున్న లిస్టులో తన పేరు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసింది. మాకు సెంటు భూమిలేదు, ఇల్లు లేదు, మా ఆయన రోజు కూలీ. నాకన్నా ఎవరికి ఎక్కువ అర్హత ఉంది? అని అధికారులను నిలదీసింది. అనంతగిరి మండలం శాంతినగర్ గ్రామంలో అర్హుల పేర్లు జాబితాలో లేకపోవడంతో అధికారులను గ్రామస్తులు ప్రశ్నించారు. సూర్యాపేటలోని పలు వార్డుల్లో దరఖాస్తు ఫారాలు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు ఆందోళనకు దిగారు. దరఖాస్తులకు రసీదు ఇవ్వకపోవడంతో ఇంకెన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలంటూ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. జాజిరెడ్డిగూడెం మండలంలోని కోడూరు, కొమ్మాల, వేల్పుచర్ల, కాసర్లపహాడ్ గ్రామాల్లో ప్రజలు నుండి అధికారులకు నిలదీశారు. దాంతో మొక్కుబడిగా కార్యక్రమాలను ముగించారు. హుజూర్‌నగర్ మండలం గోపాలపురం గ్రామంలో గురువారం గ్రామసభ ప్రారంభమైన కొద్ది సేపటికే ప్రజలు అధికారులపై మండిపడ్డారు. ఈ గ్రామసభలు ఎన్నికల ముందు ఆడే కొత్త నాటకమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీడీఓ లావణ్య సముదాయించినా వినకపోవడంతో గ్రామసభను అర్థాంతరంగా ముగించారు. సూర్యాపేట మండలం హనుమనాయక్‌తండా మహిళలు అధికారులను నిలదీశారు. ఆత్మకూర్.ఎస్ మండలంలోని పలు గ్రామాల్లో అధికారులకు నిరసనలు ఎదురయ్యాయి. నాగారం బంగ్లా గ్రామంలో రైతు భరోసాపై అధికారులను నిలదీశారు. మద్దిరాల మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో అర్హులకు అన్యాయం జరిగిందంటూ రాంపాక వెంకన్న అనే వ్యక్తి తాసీల్దార్‌ను నిలదీశాడు. మా ఇంటికి వచ్చి చూడండి.. మాది పురిగుడిసెనో, కాదో తెలుస్తుందంటూ స్టేజీ వద్దకు వెళ్లగా.. హెడ్ కానిస్టేబుల్ అతడిని పక్కకు నెట్టుకుంటూ తీసుకెళ్లాడు. పెన్‌పహాడ్ మండలం అనంతారం గ్రామంలో అనంతారం గ్రామంలో ఇందిర ఇండ్లలో అనర్హులను ఎంపిక చేశారంటూ ఆందోళనకు దిగారు. తుంగతుర్తి మండలంలోని పలు గ్రామాల్లో నిలదీతలు కొనసాగాయి. అర్వపల్లి మండలం కాసర్లపహాడ్‌లో రావుల సోమమ్మ అనే మహిళా రైతుకు 2 ఎకరాల 16 గుంటలు ఉండగా, సేద్యంలో లేదూ.. ఇల్లు నిర్మించాలని అధికారులు రైతుభరోసాకు ఎంపిక చేయకపోవడంతో బాధితురాలు అధికారులను నిలదీసింది. తన భూమిలో మొత్తం వ్యవసాయమే చేస్తున్నాని, ఇండ్లే లేదని మండిపడింది.

### కాంగ్రెస్ కార్యకర్తల ఆందోళన

బీబీనగర్ పట్టణ కేంద్రంలో గ్రామ సభ రసాభాసగా జరిగింది. ఇక్కడ ఏకంగా కాంగ్రెస్ కార్యకర్తలే సభను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అధికారులు ముసాయిదా జాబితాను చదవకుండా అడ్డం తగిలారు. సుమారు వెయ్యి మంది అర్హులు ఉంటే.. 300 మందికి మాత్రమే రేషన్ కార్డు జాబితా ఎలా ఇస్తారని నిలదీశారు. దాంతో పోలీసులు జోక్యం చేసుకుని సమాధానం చెప్పే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ కార్యకర్తలు వెనక్కి తగ్గలేదు. ఇదే మండలంలోని కొండమడుగు గ్రామంలో అధికారులపై గ్రామస్తులు తిరగబడ్డారు. దాంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. అర్హులకు కాకుండా అనర్హులకు ఎలా ఇస్తారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.


బీబీనగర్‌లో గ్రామసభను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

### నల్లగొండ జిల్లాలో ఎమ్మెల్యే ఘెరావ్

నల్లగొండ జిల్లావ్యాప్తంగా ప్రజా పాలన గ్రామసభల్లో మూడో రోజు జనాగ్రహం పెల్లుబిక్కింది. ఏ ఊరిలో చూసినా.. ఏ వార్డులో చూసినా... జనం తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికారులు జాబితాలు చదువుతుండగా పేర్లు జాబితాలో ఎందుకు లేవని ఎక్కడికక్కడ నిలదీశారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం గుడూరు గ్రామసభకు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి హాజరు కాగా జనం ఆయన్ని ఘెరావ్ చేశారు. ఇక్కడ అధికార, ప్రతిపక్ష పార్టీల నేతల మధ్య వాగ్వాదం జరిగింది. త్రిపురారం మండలం బెజ్జికల్‌లో విజయ్ అనే యువకుడు తమ గ్రామంలో అనర్హులే ఎక్కువగా ఉన్నారంటూ నిరహార దీక్షకు దిగాడు. నిడమనూరు మండల శాఖపురంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అర్హులైన తమ పేర్లు లేవని కూలీలు అధికారులను నిలదీశారు. ముప్పారంలోనూ అధికారులపై గ్రామస్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ అధికారులపై కాంగ్రెస్ పార్టీ నేతలే గరంగరం అయ్యారు. గుర్రంపోడు మండల కేంద్రంలో గ్రామసభకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరుకాగా చాలా మంది అర్హుల పేర్లు జాబితాల్లో లేకపోవడంతో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ పేర్లు కూడా జాబితాలో చేర్చాలని రచ్చ చేశారు. తిరుమలగిరి(సాగర్) మండలం రంగూడ్లల్లో తమ పేర్లు ఎందుకు లేవని మహిళలు అధికారులపై మండిపడ్డారు. ప్రభుత్వానికి శాపనార్థాలు పెట్టారు. శాలిగౌరారంలో జరిగిన గ్రామసభలో అర్హుల పేర్లు లేకపోవడంతో ఇంకా ఎన్నిసార్లు దరకాస్తులు పెట్టాలని అధికారులను నిలదీశారు. చందంపేట మండలం ముదుదుండ్లలో అర్హులైన వారి పేర్లు లేవని గ్రామస్తులు ఆందోళనకు దిగారు. తమ పేర్లు చేర్చే వరకు కదిలేది లేదని అధికారులను చుట్టుముట్టారు. నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలులో జాబితాలన్నీ తప్పులతడకగా ఉన్నాయంటూ అధికారులతో మహిళలు వాదనకు దిగారు. వేములపల్లిలో లబ్ధిదారుల జాబితాలో అనర్హులపై అధికారులతో బీఆర్ఎస్ నేతలు వాగ్వాదం చేశారు. అనర్హులను తొలగించి అర్హులను చేర్చాలని డిమాండ్ చేయగా, కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుతగలడంతో రసాభాసగా మారింది. కట్టంగూరు మండలం అయిటిపాములలో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల జాబితాల్లో అందరి పేర్లు లేవని, కొద్దిమందికే ఎలా ఇస్తారని గ్రామస్థులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. చిట్యాల మండలం సుంకెనపల్లిలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసాలో అసలైన పేదల పేర్లు లేవని, రేషన్‌కార్డుల కోసం గతంలో దరఖాస్తు చేసుకున్నా పేర్లు రాలేదని ఆందోళనకు దిగారు.


సంస్థాన్ నారాయణపురంలో సంక్షేమ పథకాలను అర్హులకే ఇవ్వాలని ఎంపీడీఓకు దండం పెడుతున్న చిలువేరు భిక్షం


తిరుమలగిరి(సాగర్) మండలం రంగుండ్లలో అధికారితో వాగ్వాదానికి దిగిన మహిళ


సంస్థాన్ నారాయణపురంలో రేషన్ కార్డు, ఇండ్ల జాబితాలో పేరు లేదని అధికారిని నిలదీస్తున్న మహిళలు


భువనగిరి కలెక్టరేట్ : చందుపట్లలో అధికారులను నిలదీస్తున్న బీఆర్ఎస్ నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు


చౌటుప్పల్ సీహెచ్‌సీలో డయాలసిస్ పేషెంట్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ హనుమంతరావు

## డ్యూటీకి రాని డాక్టర్లకు షోకాజ్‌లు

- ఇద్దరు కాంపౌండర్లకు కూడా..
- చౌటుప్పల్ సీహెచ్‌సీని ఆక్మసిక తనిఖీ చేసిన కలెక్టర్ హనుమంత రావు

చౌటుప్పల్, జనవరి 23 : రోగులకు వైద్య సేవలు అందించాల్సిన డాక్టర్లు సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరు అవడంపై యాదాద్రి భువనగిరి కలెక్టర్ హనుమంతరావు సీరియస్ అయ్యారు. చౌటుప్పల్ పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్యులు, సిబ్బంది హాజరు పట్టిక, ఓపీ రిజిస్టర్, ల్యాబ్, మందుల స్టాక్, డయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు. సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజరైన జనరల్ సర్జన్ వివేక్, నాచురోపతి వైద్యురాలు గీత, కాంపౌండర్లు అశ్విని, మెర్సీకి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వచ్చిన రోగులతో మాట్లాడి వైద్య సేవలపై ఆరా తీశారు. దవాఖానలో ఓపీ, డెలివరీల సంఖ్య చాలా తక్కువగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. అత్యవసర సిబ్బంది ఎప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ఆసుపత్రికి వచ్చిన రోగులను టెస్టుల కోసం ప్రైవేటు ల్యాబ్‌లకు పంపిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. వంద పడకల దవాఖానను పరిశీలించి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ శేఖర్‌రెడ్డి, తాసీల్దార్ హరికృష్ణ, ఆర్ఐ సుధాకర్ రావు, వైద్యురాలు అలివేలు, ఇతర వైద్యసిబ్బందిపాల్గొన్నారు.

## పొగమంచులో ప్రయాణం ప్రాణం మీదికి..

రాజాపేట, జనవరి 23 : దట్టంగా కమ్ముకున్న పొగ మంచులో చేసిన ప్రయాణం ఇద్దరి ప్రాణం మీదికి తీసుకువచ్చింది. రాజాపేటకు చెందిన ఉప్పల శ్రీనివాస్ తన కూతురును కాలేజీకి తీసుకు వెళ్లడం కోసం గురువారం ఉదయం హైదరాబాద్‌కు కారులో బయల్దేరాడు. పొట్టిమర్రి కల్వర్టు పైనుంచి వెళ్తుండగా, పొగ మంచు కారణంగా దారి కనిపించక అదుపు తప్పి కారు కల్వర్టులో పడింది. కారు ఒక పక్కకు ఒరిగి అలాగే ఆగిపోవడంతో కారులో ఉన్న ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు.


పొట్టిమర్రి కల్వర్టులో పడిపోయిన కారు



కలెక్టరేట్ ఎదుట ధర్నాలో పాల్గొన్న చేనేత కార్మికుల సంఘం సభ్యులు

## చేనేత బోర్డు ఏర్పాటు చేయాలి

- సంఘం ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్
- కలెక్టరేట్ ఎదుట ధర్నా

నల్లగొండ రూరల్, జనవరి 23 : చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి, పరిశ్రమ అభివృద్ధికి, కార్మికుల సంక్షేమం కోసం చేనేత బోర్డును ఏర్పాటు చేసి బడ్జెట్‌లో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి మురళీధర్ డిమాండ్ చేశారు. చేనేత కార్మికుల డిమాండ్లను పరిష్కారించాలని కోరుతూ గురువారం జిల్లా కలెక్టరేట్ వద్ద నిర్వహించిన ధర్నా, నిరసన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మట్లాడారు. చేనేత కార్మికుడిని యజమానిగా చేసే వర్కర్ టూ ఓనర్ పథకాన్ని రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేయాలని కోరారు. ఇల్లు లేని కార్మికులకు రూ.5 లక్షల పెట్టుబడి సాయం అందించి హౌజ్ కం వర్క్‌షెడ్ పథకాన్ని పునరుద్ధరించాలన్నారు. అనంతరం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గణేశ్, కర్నాటి వెంకటేశం, నాగరాజు, దశరథ, సైదులు, శివ, వెంకటేశం, నరసింహ పాల్గొన్నారు.

